కర్ణాటకలో మద్యం స్కామ్!

- కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో మరో కుంభకోణం
- అక్రమాల విలువ రూ.700 కోట్లు పైమాటే
- ఒక్కో బార్ లైసెన్స్‌కు రూ.75 లక్షల లంచం
- అధికారుల బదిలీలకూ రూ.లక్షల్లో వసూలు
- కీలక సూత్రధారి ఎక్సైజ్ మంత్రి తిమ్మాపుర్
- కర్ణాటక వైన్ మర్చంట్స్ అసోసియేషన్ సంచలన ఆరోపణలు.. గవర్నర్, లోకాయుక్తకు ఫిర్యాదు
- లంచం సొమ్ము ఎన్నికల్లో వాడారని ఆరోపణలు
- టీఏ/డీఏ స్కామ్‌లోనూ నిందితుడిగా తిమ్మాపుర్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్కామ్‌లకు అడ్డాగా మారిపోయింది. ముడా, వాల్మీకి, కేఐఏడీబీ, వక్ఫ్ కుంభకోణాలతో ఇప్పటికే పీకల్లోతు చిక్కుల్లో కూరుకుపోయిన సీఎం సిద్ధరామయ్య సర్కారుకు కొత్తగా మద్యం స్కామ్ మంటలు అంటుకొన్నాయి. ఎక్సైజ్ మంత్రి ఆర్బీ తిమ్మాపుర్ కనుసన్నల్లో రూ. 700 కోట్ల మేర మద్యం కుంభకోణం చోటుచేసుకొన్నదని కర్ణాటక వైన్ మర్చంట్స్ అసోసియేషన్ సంచలన ఆరోపణలు చేసింది. ఎక్సైజ్ శాఖలో నెలకొన్న అవినీతిని కట్టడి చేయాలంటూ గవర్నర్ కార్యాలయం, చీఫ్ సెక్రటరీ, కర్ణాటక లోకాయుక్తకు అసోసియేషన్ ఓ లేఖలో, ఈ-మెయిల్‌లో విజ్ఞప్తి చేసింది.

ఈ-మెయిల్‌లో ఏమున్నది?

ఇంగ్లిష్ న్యూస్ వెబ్‌సైట్ ఇండియా టుడే కథనం ప్రకారం.. అసోసియేషన్ ఈ-మెయిల్‌లో కింది విధంగా ఆరోపణలు చేసింది. 'రాష్ట్రంలోని ఎక్సైజ్ శాఖలో పెద్దయెత్తున అవినీతి రాజ్యమేలుతున్నది. ఎక్సైజ్ శాఖామాత్యులు తిమ్మాపుర్, శాఖలోని ఉన్నతాధికారులు నిబంధనలకు విరుద్ధంగా, దోపిడీకి పాల్పడుతున్నారు. డిపార్ట్‌మెంట్‌లో ఎవరైనా అధికారులు బెంగళూరు పరిధిలో బదిలీ కోరుకొంటే మంత్రి తిమ్మాపుర్ ఆయా అధికారుల నుంచి పెద్దయెత్తున డబ్బును లంచంగా స్వీకరించేవారు. ట్రాన్స్‌ఫర్ నిమిత్తం అవసరమైన ఆ డబ్బు కోసం సదరు అధికారులు మద్యం దుకాణాల యజమానుల నుంచి వసూళ్లకు తెగబడేవారు. సీఎల్7 బార్ (బార్లు, రెస్టారెంట్లకు కర్ణాటకలో ఇచ్చే లైసెన్సులు) లైసెన్సు కావాలంటే, నిబంధనల ప్రకారం.. ఏడాదికి రూ. 4 లక్షల నుంచి రూ. 8.5 లక్షల వరకూ చెల్లించాలి. అయితే, అధికారుల సాయంతో మంత్రి తిమ్మాపుర్ మాత్రం లిక్కర్ షాప్ యజమానుల నుంచి సీఎల్7 లైసెన్స్ కోసం రూ.30-70 లక్షల వరకూ లంచం రూపంలో అదనంగా వసూలు చేసేవారు. ఇది చట్టానికి విరుద్ధం. గడిచిన ఏడాది వ్యవధిలో ఇలా దాదాపు వెయ్యి లైసెన్సుల ద్వారా రూ.300 కోట్ల నుంచి రూ.700 కోట్లకు పైగా మంత్రి అవినీతికి పాల్పడ్డారు. ఇక, ఎక్సైజ్ శాఖలో బదిలీల కోసం ఒక్కరోజులోనే ముగ్గురు డిప్యూటీ కమిషనర్లు, తొమ్మిది మంది సూపరింటెండెంట్స్, 13 మంది డిప్యూటీ సూపరింటెండెంట్స్ ఆఫ్ ఎక్సైజ్, 20 మంది ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ల నుంచి మంత్రి తిమ్మాపుర్ రూ.16 కోట్ల వరకూ వసూళ్లు చేశారు. కింది స్థాయి అధికారుల బదిలీ కోసం ఒక్కో డిప్యూటీ కమిషనర్ రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షలు వసూలు చేసేవారు. డిప్యూటీ కమిషనర్ బదిలీ కోసం మంత్రి తిమ్మాపుర్ రూ.3 కోట్ల వరకూ వసూలు చేసేవారు. ఇదో పెద్ద కుంభకోణం. దీనిపై సత్వర విచారణ జరిపించాలని కోరుకొంటున్నాం' అంటూ 'హ్యూజ్ బైబ్ అండ్ మనీలాండరింగ్ టుక్ ప్లేస్ ఇన్ ఎక్సైజ్ మినిస్టర్ ఆఫీస్ బెంగళూరు ఇన్ ట్రాన్స్‌ఫరింగ్ ఎక్సైజ్ ఆఫీసర్స్ అండ్ టు కంట్రోల్ ఇల్లీగల్ కలెక్షన్ ఆఫ్ మనీ ఫర్ ఎలక్షన్ పర్పస్ ప్రమ్ ఎక్సైజ్ అఫీషియల్' పేరిట అసోసియేషన్ ఈ-మెయిల్‌లో పేర్కొంది. లంచంగా స్వీకరించిన డబ్బును మంత్రి తిమ్మాపుర్ ఎన్నికల్లో వాడినట్టు ఆరోపించింది. దీనిపై గవర్నర్ కార్యాలయం ఆదేశాలతో లోకాయుక్త పోలీసులు దర్యాప్తు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. కాగా, 2013-18 మధ్య సిద్ధరామయ్య సీఎంగా ఉన్నప్పుడు కర్ణాటకలో వెలుగుచూసిన టీఏ/డీఏ స్కామ్‌లోనూ ఆర్బీ తిమ్మాపుర్ ప్రధాన నిందితుడిగా ఉండటం గమనార్హం.

వాళ్లేం తప్పు చేశారో ఎవరికి ఎరుక?

కర్ణాటక వైన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆరోపణలను మంత్రి తిమ్మాపుర్ ఖండించారు. 'వాళ్లు ఏం తప్పు చేశారో ఎవరికి తెలుసు?' అంటూ ఎదురుదాడికి దిగారు. 'మద్యం వ్యాపారులు ఏదైనా తప్పు చేస్తేనే, అధికారులు వాళ్లను వేధిస్తారు. ముందు మద్యం వ్యాపారులు తాము చేసిన తప్పులను సరిదిద్దుకోవాలి. ఇక, వాళ్లు ఆరోపించినట్టు ఎక్సైజ్ శాఖలో ఎలాంటి అవినీతి జరుగలేదు. అసలు అధికారులకు డబ్బు ఇవ్వాల్సిన అవసరం వాళ్లకు ఏముంది? ఏ తప్పూ చేయకుంటే అధికారులకు వాళ్లు డబ్బు ఎందుకు ఇస్తారు?' అంటూ తిమ్మాపుర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కర్ణాటకలో స్కాంగ్రెస్ సర్కారు

కర్ణాటక వైన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్ష నేత, బీజేపీ నాయకుడు ఆర్ అశోకా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కర్ణాటకలో స్కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తున్నదంటూ ఎద్దేవా చేశారు. వాల్మీకి, ముడా, కేఐఏడీబీ, వక్ఫ్ స్కామ్‌ల తర్వాత ఇప్పుడు కొత్తగా సిద్ధరామయ్య సర్కారు ఖాతాలో లిక్కర్ స్కామ్ జమైందని అన్నారు.




transferring excise officers and to

Subject: Huge Bribe and money laundering took place in excise minister office Bangalore in transferring excise officers and to control illegal collection of money for election purpose from excise officials.

మద్యం స్కామ్‌కు సంబంధించి వైన్ మర్చంట్స్ అసోసియేషన్ పంపించిన ఈ-మెయిల్



మద్యం స్కామ్‌పై దర్యాప్తు జరుపాలంటూ వైన్ మర్చంట్స్ అసోసియేషన్ పంపించిన లేఖ

మంత్రికి ఇవ్వాలంటూ వసూళ్లు

'ఈ స్కామ్ వేల కోట్లతో ముడిపడి ఉన్నది. సీఎల్7 ఒక్కో లైసెన్స్ కోసం రూ. 30 లక్షల నుంచి రూ. 75 లక్షల వరకూ లంచంగా తీసుకొనే వారు. 'మేము ఈ పోస్టుకు రావడానికి మంత్రి ఆర్బీ తిమ్మాపుర్‌కు డబ్బులు చెల్లించాం. కాబట్టి, మీరు కూడా ఇవ్వాల్సిందే'నంటూ అధికారులు మా నుంచి బహిరంగంగా వసూళ్లకు తెగబడేవారు. గడిచిన ఏడాదిలో ఇలా అక్రమ వసూళ్లతో దాదాపు వెయ్యి లైసెన్సులు జారీ చేశారు. సీఎల్7 లైసెన్స్ ఫీజును తగ్గిస్తూ, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో నెలకొన్న అవినీతిని కట్టడి చేయాలంటూ సీఎం సిద్ధరామయ్యకు లేఖ రాశాం'

– ఎస్ గురుస్వామి, వైన్ మర్చంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్.

ముడా కేసులో సిద్ధూకు నోటీసులు

కేసును సీబీఐకి బదిలీ చేయాలన్న పిటిషన్‌పై స్పందన తెలపాలని ఆదేశించిన హైకోర్టు

బెంగళూరు, నవంబర్ 5: ముడా స్కామ్ కేసును సీబీఐకి బదిలీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు ఆ రాష్ట్ర హైకోర్టు మంగళవారం నోటీసులు జారీచేసింది. ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి క్రిష్ణ ఈ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు, ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు దర్యాప్తునకు సంబంధించిన రికార్డును కోర్టుకు సమర్పించాలని జస్టిస్ ఎం నాగప్రసన్న లోకాయుక్తను ఆదేశించారు. అంతేకాకుండా ఈ కేసుకు సంబంధించి సీఎంతో పాటు ఆయన భార్య పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సీబీఐ, లోకాయుక్తకు కూడా న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబర్ 26కు వాయిదా వేసింది.

నేడు సిద్ధరామయ్య విచారణ

ముడాకు చెందిన 14 స్థలాలను అక్రమంగా తన భార్య పేరున మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) నుంచి కేటాయించుకున్నట్టు కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఆరోపణలున్న విషయం తెలిసిందే. గతంలో ఆమె నుంచి ప్రభుత్వం 3.16 ఎకరాల భూమి తీసుకుని దానికి బదులుగా 50:50 శాతం విధానంలో ఆమెకు ముడా 14 ప్లాట్లను కేటాయించింది. అయితే ఆమె తీసుకున్న భూమి కన్నా ఈ ప్లాట్ల విలువ ఎన్నో రెట్లు అధికమని, పైగా కాసర గ్రామంలో ప్రభుత్వం తీసుకున్న 3.16 ఎకరాల భూమిపై ఆమెకు చట్టబద్ధంగా ఎలాంటి హక్కు లేదని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న లోకాయుక్త పోలీసులు ఆయనను ఒకటో ముద్దాయిగా, ఆయన భార్య పార్వతిని రెండో ముద్దాయిగా చేర్చారు. కాగా, ఆమెను గత నెల 25న లోకాయుక్త విచారించగా, నవంబర్ 6న తమ ముందు విచారణకు హాజరు కావాలంటూ సీఎం సిద్ధరామయ్యకు నోటీసులు జారీ చేసింది.

కర్ణాటక కాంగ్రెస్ మంత్రి పీఏ వేధింపులతో

ఉద్యోగి బలవన్మరణం

అన్యాయాన్ని ఎదుర్కోలేకపోతున్నానని సూసైడ్ నోట్

బెంగళూరు, నవంబర్ 5: తన సీనియర్లు, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి, కాంగ్రెస్ నాయకురాలు హెబ్బాల్కర్ ప్రైవేట్ సెక్రటరీ తనకు చేసిన అన్యాయమే తన చావుకు కారణమని కర్ణాటకలో ఓ ప్రభుత్వ ఉద్యోగి తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. మృతుడిని తహసిల్దార్ ఆఫీసులో సెకండ్ డివిజన్ అసిస్టెంట్ రుద్రన్న యాదవన్నగా గుర్తించారు. తహసిల్దార్ బసవరాజు నాగరాల, మంత్రి పీఏ సోము తన చావుకు బాధ్యులని యాదవన్న ఉద్యోగుల వాట్సాప్ గ్రూప్‌లో సందేశం పెట్టారు. మంత్రి హెబ్బాల్కర్ ప్రైవేట్ సెక్రటరీ కారణంగా తాను చాలా రోజులుగా ఇబ్బందులు పడుతున్నట్టు పేర్కొన్నారు. ఆఫీసులో జరుగుతున్న అన్యాయాన్ని భరించలేకపోతున్నానని తెలిపారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ఆఫీస్ సిబ్బంది సమైక్యంగా పోరాడాలని కోరారు. సీనియర్ అధికారుల వేధింపుల వల్లే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని అతడు ఒక వీడియో రికార్డ్ చేసినట్టు ఉద్యోగ వర్గాలు తెలిపాయి.

కేంద్ర మంత్రి కుమారస్వామిపై కేసు

పోలీస్ అధికారిని బెదిరించినట్టు ఆరోపణ

బెంగళూరు, నవంబర్ 5: కేంద్ర మంత్రి, జేడీ(ఎస్) నేత హెచ్‌డీ కుమారస్వామిపై కేసు నమోదైంది. మైనింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న తనను కుమారస్వామి బెదిరించారంటూ ఒక పోలీస్ ఉన్నతాధికారి ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. కాగా, తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని 'హాస్యాస్పదం, హానికరం' అని కుమారస్వామి పేర్కొన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తనను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతున్నదని ఆరోపించారు.సీఎంగా ఉన్న సమయంలో కుమారస్వామి 2006-08 మధ్య 550 ఎకరాలను అక్రమంగా ఒక కంపెనీకి లీజుకు ఇచ్చారన్న ఆరోపణలపై సిట్ విచారణ జరుపుతున్నది.

25 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

న్యూఢిల్లీ, నవంబర్ 5: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ నెల 25 నుంచి డిసెంబర్ 20 వరకు నిర్వహించనున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మంగళవారం తెలిపారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో ఈ నెల 26న ప్రత్యేక వేడుకలు జరపనున్నట్టు చెప్పారు. గత పార్లమెంట్ సమావేశంలో విధించిన గడువు మేరకు వక్ఫ్ సవరణ బిల్లుపై వేసిన జాయింట్ కమిటీ ఈ నెల 29న పార్లమెంట్‌లో తుది నివేదికను సమర్పించవచ్చునని భావిస్తున్నారు.

వికీపీడియాకు కేంద్రం నోటీసులు

న్యూఢిల్లీ, నవంబర్ 5: కచ్చితత్వం లేని, పక్షపాతంతో కూడిన సమాచారాన్ని 'వికీపీడియా'లో ఇస్తున్నారన్న ఫిర్యాదులపై కేంద్రం స్పందించింది. ఫిర్యాదుల్లోని అంశాలు పేర్కొంటూ 'వికీపీడియా'కు మంగళవారం నోటీసులు జారీచేసింది. ఒక సమాచార మాధ్యమంగా కాకుండా ప్రచురణ కర్త (పబ్లిషర్)గా ఎందుకు భావించరాదో తెలపాలంటూ నోటీసు పేర్కొన్నది. ఆన్‌లైన్ ఎన్‌సైక్లోపీడియాగా పిలిచే వికీపీడియాను ఇటీవలే ఢిల్లీ హైకోర్టు మందలించింది. వికీపీడియా అనుసరిస్తున్న 'ఓపెన్ ఎడిటింగ్ మోడల్'ను తప్పుబట్టింది. ఇతరుల పరువుకు భంగం వాటిల్లే ప్రమాదముందని హైకోర్టు హెచ్చరించింది. కాగా ఆ సంస్థ తన ఎడిటింగ్ మోడల్‌ను సమర్థించుకున్నది. దీనికి చట్టపరమైన సమ్మతి ఉందని చెబుతున్నది. ఓ వార్తా ఏజెన్సీ కేంద్రంలోని ప్రస్తుత ప్రభుత్వానికి ప్రచార సాధనంగా మారిందని 'వికీపీడియా' పేర్కొనటం వివాదానికి దారితీసింది. దీనిపై గత సెప్టెంబర్‌లో సదరు వార్తా ఏజెన్సీ ఢిల్లీ హైకోర్టులో పరువు నష్టం దావా వేసింది. వికీపీడియా అనుసరిస్తున్న 'ఓపెన్ ఎడిటింగ్ ఫీచర్స్' చాలా ప్రమాదకరమని కోర్టు అభిప్రాయపడింది. ఈనేపథ్యంలో కేంద్రం వికీపీడియాకు నోటీసులు జారీచేయటం గమనార్హం.

ట్రంప్ జోరా.. కమల హోరా?

- అమెరికాలో ప్రశాంతంగా అధ్యక్ష ఎన్నికలు
- బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైన ప్రజాతీర్పు
- ట్రంప్, కమల మధ్య హోరాహోరీ పోరు
- ఫలితాల వెల్లడికి నాలుగైదు రోజులు

వాషింగ్టన్, నవంబర్ 5: అగ్రరాజ్యం అమెరికాకు కాబోయే ప్రెసిడెంట్‌ను ఎన్నుకునేందుకు ఓటర్లు బారులు తీరారు. డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య నెలకొన్న హోరాహోరీ పోటీలో విజేతను నిర్ణయించే తీర్పును బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు. మంగళవారం దేశవ్యాప్తంగా పోలింగ్ జరిగింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం 4.30కు పోలింగ్ ప్రారంభమైంది. దాదాపు 50 లక్షల మంది ఆదివారం నాటికే ముందస్తుగా ఓట్లు వేయగా మిగతా వారు ఉత్సాహంగా పోలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. 'ఓటు వేసి మీ వాణిని వినిపించండి' అంటూ కమలా హారిస్ ఓటర్లకు పిలుపునివ్వగా, 'కలిసికట్టుగా మళ్లీ అమెరికాను గొప్పగా మార్చగలం. బయటకొచ్చి ఓటేయండి' అంటూ ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్, ఆయన భార్య మెలానియా ఫ్లోరిడాలోని పామ్ బీచ్‌లో ఓటు వేయగా, ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ సిన్సినాటిలో ఓటు వేశారు.

ఫలితాలకు ఎదురుచూపులే

మిస్సౌరీలోని పలు ప్రాంతాల్లో వరదల కారణంగా ఓటింగ్‌కు అంతరాయం ఏర్పడింది.జార్జియాలోని ఫుల్టన్ కౌంటీలో నకిలీ బాంబు బెదిరింపులు రావడంతో రెండు పోలింగ్ కేంద్రాలను ఖాళీ చేయించి, అరగంట తర్వాత మళ్లీ ప్రారంభించారు. ఉగ్ర హెచ్చరికలపై నకిలీ వీడియోల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎఫ్‌బీఐ సూచించింది. పెన్సిల్వేనియాలో సాంకేతిక సమస్యలతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 11.30 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. భారత్‌లా అమెరికాలో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేకంగా ఎన్నికల కమిషన్ లాంటిది లేదు. ఆయా రాష్ట్రాలే ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తాయి. ఎన్నికల కౌంటింగ్ పూర్తి చేసి ప్రకటించేందుకు డిసెంబరు 11 వరకు సమయం ఉంటుంది. అధికారికంగా ఫలితాలు వెలువడేందుకు సమయం పట్టే అవకాశం ఉన్నప్పటికీ ముందుగా మీడియా సంస్థలు నాలుగైదు రోజుల్లో ఫలితాలను అంచనా వేయవచ్చు.

ఓటమినైనా అంగీకరిస్తా: ట్రంప్

విజయంపై విశ్వాసం ఉంది. నిజాయితీగా ఎన్నిక జరిగితే ఓటమినైనా మొదటగా నేనే అంగీకరిస్తా. ఎన్నిక నిజాయితీగానే జరుగుతున్నదని అనుకుంటున్నా. ఓడితే హింసకు పాల్పడొద్దని నా మద్దతుదారులకు చెప్పక్కర్లేదు. వారు హింసకు దూరంగా ఉంటారు.

జీవన వ్యయం తగ్గిస్తా: కమల

నేను గెలిస్తే ప్రజల జీవన వ్యయాన్ని తగ్గిస్తా. దేశంలో దెబ్బతిన్న వలస విధానాన్ని సరిచేస్తా. చైనాతో నెలకొన్న పారిశ్రామిక పోటీలో దేశాన్ని గెలిపిస్తా.

సమాన ఓట్లు వస్తే ఎలా?

ట్రంప్, కమలకు 269 ఓట్లు వస్తే టై



వాషింగ్టన్, నవంబర్ 5: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఈసారి కమలా హారిస్, డొనాల్డ్ ట్రంప్ మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నది. సర్వేలు కూడా ఈసారి విజేత ఎవరనేది అంచనా వేయలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా ఎన్నికల్లో కమల, ట్రంప్‌కు సమాన ఓట్లు వస్తే ఎలా అనే ప్రశ్న తలెత్తుతున్నది. అమెరికాలోని 50 రాష్ట్రాలకు కలిపి 538 ఎలక్టోరల్ ఓట్లు ఉంటాయి. ప్రజలు వేసే ఓట్లలో మెజారిటీ ఓట్లు దక్కించుకున్న అభ్యర్థి ఖాతాలోకి ఆ రాష్ట్రంలోని ఎలక్టోరల్ ఓట్లన్నీ పడతాయి. ఇలా మొత్తంగా 270 ఓట్లు సాధించిన అభ్యర్థి విజేత అవుతారు. అయితే, ఇద్దరికీ 269-269 ఓట్లు వస్తే అనిశ్చితి నెలకొంటుంది. ఇప్పటివరకు ఇలాంటి పరిస్థితి తలెత్తలేదు.

అధ్యక్షుడిని ఎన్నుకోనున్న హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్

అభ్యర్థులకు సమాన ఓట్లు వచ్చిన, ఎవరికీ 270 ఓట్లు రాకపోతే అధ్యక్ష ఎన్నిక ఎలా జరగాలనేది అమెరికా రాజ్యాంగంలోని రెండో అధికరణంలో పొందుపరిచారు. ఈ పరిస్థితి తలెత్తితే అధ్యక్షుడిని కొత్తగా ఎన్నికైన సభ్యులతో కూడిన హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్(ప్రతినిధుల సభ) ఎన్నుకుంటుంది. ఒక్కో రాష్ట్ర ప్రతినిధి బృందానికి ఒక్కో ఓటు ఉంటుంది. ఈ ఓట్లు ఎక్కువగా పొందిన అభ్యర్థికి అధ్యక్ష పదవి దక్కుతుంది. అంటే, మొత్తం 50 రాష్ట్రాల్లో ఎక్కువ రాష్ట్రాలను గెలుచుకున్న అభ్యర్థి విజేత అవుతారు. ఇదే విధంగా ఉపాధ్యక్షుడిని సెనేట్ ఎన్నుకుంటుంది.

ప్రతినిధుల సభకు పోటీలో 9 మంది భారతీయ అమెరికన్లు

వాషింగ్టన్, నవంబర్ 5: అమెరికా ప్రతినిధుల సభకు సంబంధించి ఆయా రాష్ట్రాల్లో ఖాళీ అయిన స్థానాలకు అభ్యర్థులను ఎన్నుకుంటున్నారు. 9 మంది భారతీయ అమెరికన్లు ఎన్నికల బరిలో నిలబడ్డారు. వర్జీనియా సెనెటర్ సుహాస్ సుబ్రమణ్యన్, కాలిఫోర్నియా సెనెటర్ డాక్టర్ అమీ బెరా, వాషింగ్టన్ స్టేట్‌లో సెనెటర్ పమీలా జయపాల్, ఇల్లినాయస్ సెనెటర్ రాజా కృష్ణమూర్తి, కాలిఫోర్నియా సెనెటర్ రో ఖన్నా, మిషిగన్ సెనెటర్ శ్రీ థానెందర్ మరోమారు తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు.

భారత్ బ్రాండ్ ఫేజ్-2 ప్రారంభం

గోధుమ పిండి, బియ్యం విక్రయాలు ధరల్లో స్వల్పంగా పెరుగుదల

న్యూఢిల్లీ, నవంబర్ 5: సబ్సిడీ రేట్లపై భారత్ బ్రాండ్ ద్వారా రెండో విడతగా గోధుమ పిండి, బియ్యాన్ని విక్రయిస్తున్నట్టు కేంద్రం తెలిపింది. గోధుమ పిండి కిలో రూ.30, బియ్యం కిలో రూ.34కు 5 కేజీలు, 10 కేజీల ప్యాకెట్లలో అందించనున్నట్టు చెప్పింది. నాఫెడ్, కేంద్రీయ భాండార్, ఈ కామర్స్ ఎన్‌సీసీఎఫ్ కోఆపరేటివ్ సంస్థల ద్వారా వీటిని విక్రయిస్తున్నట్టు కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం జెండా ఊపి ప్రారంభించిన ఆయన మొదటి విడతకు, రెండో విడతకు తాత్కాలిక విరామం వచ్చిందని చెప్పారు. మొదటి విడత కన్నా రెండో విడత బియ్యం, గోధుమ పిండి ధరలు స్వల్పంగా పెరిగినట్టు (గతంలో రూ.27.5, రూ.29) మంత్రి జోషి తెలిపారు.

యూపీ మదర్సా చట్టం రాజ్యాంగబద్ధమే

సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ, నవంబర్ 5: యూపీలోని మదర్సాలకు సుప్రీం కోర్టు ఊరటనిచ్చింది. ఉత్తరప్రదేశ్ బోర్డు ఆఫ్ మదర్సా- 2004 ఎడ్యుకేషన్ చట్టాన్ని సమర్థించింది. బోర్డు లౌకిక న్యాయ సూత్రాలను ఉల్లంఘించిందంటూ దానిని రద్దు చేస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును మంగళవారం సుప్రీం కోర్టు పక్కన పెట్టింది. ఈ చట్టం లౌకిక వాద సూత్రాన్ని ఉల్లంఘించిందని హైకోర్టు తప్పుగా అభిప్రాయపడిందని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. యూపీ మదర్సా విద్యా చట్టాన్ని తాము సమర్థిస్తున్నామని పేర్కొంది. కాగా, యూపీలో మదర్సాల విద్యా చట్టం చెల్లదని, అందువల్ల మదర్సా విద్యాసంస్థలను మూసివేసి దానిలోని విద్యార్థులను రాష్ట్రంలోని వేరే విద్యాసంస్థల్లోకి మార్చాలంటూ గతంలో హైకోర్టు తీర్పు ఇచ్చింది. సుప్రీం కోర్టు తాజా తీర్పుతో ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

'బ్లూ వాల్'ను ట్రంప్ బ్రేక్ చేస్తారా?

- 2016లో 3 రాష్ట్రాల్లో ట్రంప్ విజయం
- 2020లో మళ్లీ వాటిని దక్కించుకున్న డెమోక్రాట్లు
- బ్లూ వాల్ ..ఈసారి కీలకం



వాషింగ్టన్, నవంబర్ 5: అమెరికాకు మరోసారి అధ్యక్షుడిని కావాలని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే, ఆయన అధ్యక్షుడు కావాలంటే 'బ్లూ వాల్'ను బ్రేక్ చేయాల్సిందే అని అంటున్నారు అమెరికా పొలిటికల్ పండిట్లు. సంప్రదాయంగా డెమోక్రటిక్ పార్టీకి మద్దతిచ్చే రాష్ట్రాలను 'బ్లూవాల్' స్టేట్స్ అంటారు. ఇవి 18 రాష్ట్రాలు ఉన్నాయి. కాలిఫోర్నియా, న్యూయార్క్, ఇల్లినాయిస్, పెన్సిల్వేనియా, మిషిగన్, న్యూజెర్సీ, వాషింగ్టన్, మసాచుసెట్స్, మేరీల్యాండ్, మిన్నెసోటా, విస్కాన్సిన్, ఓరెగావ్, కనెక్టికట్, హవాయ్, మైనె, రోడ్ ఐలాండ్, డెలావర్, వెర్మాంట్ రాష్ట్రాలను బ్లూ వాల్ స్టేట్స్ అంటారు. వీటిల్లో 238 ఎలక్టోరల్ ఓట్లు ఉన్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలవాలంటే 270 ఎలక్టోరల్ ఓట్లు కావాలి. కాబట్టి, ఈ బ్లూవాల్ స్టేట్లను కనుక కమలా హారిస్ నిలుపుకోగలిగితే అధ్యక్షురాలు కావడం సులభం. ట్రంప్ గెలవాలంటే ఈ 18 రాష్ట్రాల్లో కొన్నింటినైనా తన వైపు తిప్పుకోవాలి.

2016లో ట్రంప్ ఖాతాలో మూడు రాష్ట్రాలు

1992 నుంచి 2012 వరకు ఈ రాష్ట్రాలు ఏకపక్షంగా డెమోక్రటిక్ పార్టీ వైపు నిలిచాయి. 2016 ఎన్నికల్లో మాత్రం పెన్సిల్వేనియా, మిషిగన్, విస్కాన్సిన్ రాష్ట్రాలను అనూహ్యంగా రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ దక్కించుకున్నారు. ఈ మూడు రాష్ట్రాల్లో కలిపి 44 ఓట్లు ఉన్నాయి. ట్రంప్ అధ్యక్షుడు కావడానికి ఈ ఓట్లు కలిసొచ్చాయి.

అర్ధరాత్రి ఓటింగ్.. నిమిషాల్లో ఫలితం

ట్రంప్, కమలకు సమానంగా ఓట్లు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మొదటి ఫలితం వచ్చింది. న్యూ హాంప్షైర్ రాష్ట్రంలోని డాక్స్‌విల్లె నాచ్ అనే చిన్న గ్రామంలో సోమవారం అర్ధరాత్రే పోలింగ్ జరిగింది. ఈ గ్రామంలో కేవలం ఆరు గురు ఓటర్లే ఉన్నారు. పోలింగ్ ముగిసిన నిమిషాల్లోనే ఫలితం వెలువడింది. ఆరు ఓట్లలో మూడు డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్‌కు, మూడు ఓట్లు రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్‌నకు దక్కాయి. డాక్స్‌విల్లె నాచ్‌లో ప్రతిసారి త్వరగా ఫలితాలు వెలువడతాయి. ఇక్కడి ఫలితం అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపును అంచనా వే